www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 3 జూన్ 2023
5
డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ



నిరుపయోగంగా దోనె

ప్రజాశక్తి-మండపేట

తాపేశ్వరం శివారు పేకేటిపాకల వద్ద దోనె నిరుపయోగంగా ఉంది. ఇది శిథిలమై ఇనుము మట్టిలో కలుస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో కాలువ దాటేందుకు వంతెన లేని సమయంలో రైతులు, కూలీలకు ఈ దోనే ఉప యోగపడేద న్నారు. వంతెన నిర్మాణంతో ఇది నిరుపయోగంగా మారిందని కాలువలోనే ఉండే దీనిని ఒడ్డుకు చేర్చి వదిలేశారన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో తుప్పు పట్టి మట్టి పాల వుతోందని, పూర్తిగా పాడవకముందే వేలంవేసి ప్రభుత్వఖజానాకుజమచేయాలన్నారు.



పాడై తుప్పు పట్టి పోతున్న దోనె

జాతీయ రహదారి దాటేదెలా..

▶ చెముడులంక వద్ద వెంటాడుతున్న సమస్య

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలోని చెముడులంక నాలుగు లైన్ల జాతీయ రహదారి (216ఎ) దాటేందుకు స్థానికులు అనేక అవస్థలు పడుతున్నారు. రెండు దశాబ్దాలుగా ఈ సమస్య ఇలాగే కొనసాగుతోంది. చెముడులంక గ్రామానికి అవతల బడుగువానిలంక గ్రామం ఉంది. ఆ ప్రాంతంలో సుమారు రెండు వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇంత ప్రాధాన్యత ఉండి దారి ఎందుకు ఇవ్వలేదనే అనుమానం రాకమానదు. దీనికి కారణం బడుగువానిలంక వెళ్లడానికి కాలిబాట వంతెన మాత్రమే ఉన్నందున డివైడర్ వేసుకునేందుకు వీలుపడదని నేషనల్ హైవే అధికారులు గతంలో అభ్యంతరం చెప్పారు. 2002లో ఈ రోడ్డును నాలుగులైన్ల రోడ్డుగా విస్తరించినప్పుడే ఈ దారి కోసం ప్రజలు పట్టుబట్టారు. కాని సాధ్యపడలేదు. అయితే ఆ తర్వాత రోజుల్లో బడుగువానిలంక వెళ్లేందుకు పెద్ద వంతెన నిర్మించారు. ఈ వంతెన వచ్చినందుకు ఆనందం లేకుండా పోయింది. ఎందుకంటే వాహనాలు ఈ వంతెన దాటాలంటే అటు మడికి ఇటు చొప్పెల్ల తిరిగి రావాల్సి ఉంది. చాలా మంది అంత దూరం వెళ్లేక రాంగ్ రూట్లో ప్రయాణించడం వల్ల ప్రమాదాలబారిన పడుతున్నారు.

ఆ ప్రమాదంతో దారి మూతపడింది

అయితే ఇక్కడ పరిస్థితి చూసి చెముడులంక రామాలయం సెంటర్లో కార్లు వెళ్లే విధంగా గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్న మార్గానికి హైవే అధికారులు కూడా అనధికారికంగా మద్దతు ఇచ్చారు. చాలా కాలం పాటు ఆ మార్గం ద్వారా రాకపోకలు సాగించారు. కాని అక్కడ ఒక బైకుపై రోడ్డు దాటుతుండగా వేగంగా కారు వచ్చి ఢీకొనడంతో ఇద్దరు మతి చెందారు. అయితే ఆ కారు నడిపిన ఎన్నారై మహిళ కోర్టును ఆశ్రయించారు. అనధికారిక మార్గం ఏర్పాటు చేయడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆమె పట్టుబట్టడంతో ఆ డివైడర్ ను ఎన్‌హెచ్ అధికారులు మూసివేశారు. అప్పటి నుంచి కేవలం మోటారు సైకిళ్ల మాత్రమే వెళ్లడానికి వీలుగా రామాలయం సెంటరు, ధనలక్ష్మి అమ్మవారి ఆలయ సెంటర్లో రెండు మార్గాలు గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్నారు. కాని హైవే అధికారులు ఆదేశాలు మేరకు సిబ్బంది ఆ అనధికారిక మార్గాలను మూసివేయడం స్థానిక నాయకులు అడ్డుకోవడం సర్వసాధారణమైపోయింది. కొద్ది రోజుల క్రితం కూడా ఈ మార్గాన్ని ఇనుప గడ్డర్లతో మూసివేస్తుండగా ఆ గ్రామ సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ వెళ్లి అడ్డుకున్నారు .మాకు దారి లేకుండా చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మాకు దారి చూపండి

ఎన్నో ఏళ్లుగా కోరుకుంటున్న హైవే దాటడానికి దారిని చూపాలని లంక గ్రామాల ప్రజలు, రైతులు కోరుకుంటున్నారు. ఎందుకంటే లంక భూముల్లో ఏడాది పొడవునా పువ్వులు, కూరగాయలు, అరటి వంటి వాణిజ్య పంటలు సాగు చేస్తారు. వీటిని మార్కెట్‌కు మోటారు సైకిళ్లు, ఆటోల్లో తీసుకెళతారు. అయితే చెముడులంకలో రోడ్డు దాటే అవకాశం లేనందున చుట్టి తిరిగి వెళ్లలేక రాంగ్ రూట్ లో ప్రయాణించి ప్రమాదాల బారిన పడుతున్నారు. అదీగాక చెముడులంక గ్రామ పంచాయతీ వారు గ్రామంలో సేకరించిన చెత్తను కాలువ అవతలకు తీసుకెళ్లాలి. ఇక్కడ రోడ్డు దాటే అవకాశం లేనందున చెత్త ట్రాక్టర్ మడికి, చొప్పెల్ల చుట్టు తిరిగి వెళ్లడం భారమవుతోంది. చెత్తను కాలువలో తీసుకెళ్ళి పోయడం వల్ల జాతీయ రహదారి పొడవునా గ్రామస్తులు చెత్త వేస్తున్నారు.

చెముడులంకలో రోడ్డు దాటడానికి డివైడర్ సౌకర్యం కల్పించాలని గ్రామ పంచాయతీ తీర్మానం కూడా చేసింది. రాష్ట్ర ప్రభుత్వ విప్, కొత్తపేట ఎంఎల్ఏ చిర్ల జగ్గిరెడ్డి కూడా ఇక్కడ ఈ మార్గం సమస్యను నేషనల్ హైవే అధికారుల దృష్టికి పలుసార్లు తీసుకెళ్లారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడ అధికారిక మార్గాన్ని ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని లంక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



చెముడులంక వద్ద డివైడర్ లేని జాతీయ రహదారి



రామాలయం ఎదురుగా అనధికార మార్గం

కౌలు దారుల హక్కు చట్టాన్ని సవరించాలి

▶ కౌలు రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - రామచంద్రపురం

పంట సాగుదారుల హక్కు చట్టం పగడ్బందీగా అమలు చేయాలి లేదా ఈ చట్టాన్ని సవరించాలని కోరుతూ రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్‌కు ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు రామచంద్రపురంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో 32 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారన్నారు. ఈ కౌలు రైతుల కుటుంబాలు కోటి 20 లక్షల మంది జీవనం సాగిస్తున్నారని, వ్యవసాయ అనుబంధ రంగాల్లో మరో కోటి మంది జీవనం సాగిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2019లో తీసుకొచ్చిన సిసిఆర్‌సి చట్టం వల్ల కౌలు రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. ఈ చట్టాన్ని పగడ్బందీగా చట్టంలో పేర్కొన్న విధంగా సాగు చేసే రైతులకు పరిహారాలు ఇచ్చేటట్లుగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేనియెడల ఈ చట్టాన్ని సవరించాలన్నారు. పంట నష్టం, పంట రుణం, పంటల బీమా, రైతు భరోసా ఇతర ప్రయోజనాలన్నీ సాగు చేసే రైతులకు దక్కాలన్నారు. కార్డు లేదా ఇ-క్రాప్‌లో కౌలు రైతుకు చోటు దక్కితేనే ఇవన్నీ వస్తాయన్నారు. కౌలు రైతుకు కార్డు ఇచ్చేందుకు భూ యజమానులు సంతకం పెట్టకపోవడంతో కార్డు రాకపోవడం వల్ల ప్రభుత్వ రాయితీలు అన్ని భూ యజమానులకే పోతున్నాయన్నారు. దీనివల్ల సాగుదారునికి నష్టం వాటిల్లి ఆత్మహత్యలు పెరుగుతున్నాయన్నారు. ఈ 15 రోజులు కాలంలో చొల్లంగి, చేదువాడ, దుగుదుర్రు గ్రామాల్లో ముగ్గురు కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని కార్డు లేకపోవడం వల్ల ఈ ముగ్గురికి పరిహారం రాదంటున్నారని ఆయన అన్నారు.



ఎంపీ బోస్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సిఎం దృష్టికి సమస్యలను తీసుకువెళతా : ఎంపీ బోస్

ఈ సమస్యలపై స్పందించిన రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు అందజేసిన వినతిపత్రంలో ప్రస్తావించిన సమస్యలన్నీ చట్టంలో ఉన్నవేనని అయినా ఆచరణలో అమలు కానందుకు తాను చాలాసార్లు బాధపడ్డానని అన్నారు. ఇప్పటికీ గ్రామాల్లో మీటింగ్ లో తాను కూడా చెబుతున్నానని అన్నారు. ఈ సమస్యను సిఎం దృష్టికి తీసుకువెళ్తానని ఎంపీ బోస్ అన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లి సూర్య ప్రకాశ్, కాజులూరు కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి సువారు గోవిందు, తాళ్లంపు మండల అధ్యక్షులు పాలెపు ఈశ్వరరావు పాల్గొన్నారు.

పొగాకు అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి-అమలాపురం

నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఎన్‌సిడి సోషల్ వర్కర్ ప్రమీల ఆధ్వర్యంలో శుక్రవారం మలికిపురం మండలం లక్కవరం పి హెచ్ సి నందు పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని 60 రోజులపాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా ఆసుపత్రి సిబ్బందికి, రోగులకు అవగాహనా కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో పొగాకు ఏ రూపంలో తీసుకొన్న ఆ కారణంగా ఆరోగ్యపరంగా తలెత్తే అనర్థాలపై డాక్టర్ సౌమ్య (సైక్రియాటిస్ట్) అవగాహనా కల్పించారు. అనంతరం ఎన్‌సిడి సోషల్ వర్కర్ ప్రమీల ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు కళాశాల ల పొగాకు రహిత ప్రాంతాల ఉండేటట్లు చూడవలిసినా బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పి హెచ్ సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దుర్గా ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఎంపిడిఒ నాతి బుజ్జి ఆదేశించారు. శుక్రవారం వైద్యాధికారులు డాక్టర్ ఎం.రామ చౌదరి, డాక్టర్ సుస్మిత, డాక్టర్ సునీత, ఐసిడిఎస్ సూపర్ వైజర్ కుమారి తో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న పాల వెల్లువ తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వాలంటీర్లు నిర్వహిస్తున్న జగనన్న పాల వెల్లువ సర్వే విషయంలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సర్వే నిర్వహించు సమయంలో సరియైన సమాచారం నమోదు చేసేలా క్రాస్ చెక్ చేయాలని పంచాయతీ కార్యదర్శులు, వెటర్నరీ సిబ్బందికి సూచించారు. సకాలములో సర్వే పూర్తి చేయాలన్నారు. మహిళా పోలీసులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లు సందర్శించి అక్కడ అభివద్ధి పనులు, సమస్యలను తనిఖీ చేసి ప్రభుత్వం వారు ఏర్పాటు చేసిన యాప్ లో నమోదు చేయాలన్నారు.

పట్టణ పరిశుభ్రతకు సహకరించాలి

ప్రజాశక్తి-మండపేట

పట్టణ పరిశుభ్రతకు అందరూ సహకరించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్య అన్నారు. స్థానిక 14వ సచివాలయం పరిధి 29 వార్డులో చేపట్టిన ప్రోగ్రాం మేరీ లైఫ్ మేరీ స్వచ్ఛ శహర్‌పై కార్యక్రమం ఆమె ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. ఆమె మాట్లాడుతూ నిరుపయోగంగా ఉన్న పాతదుస్తులు, పుస్తకాలు, ప్లాస్టిక్, ఎలక్ట్రికల్ తదితర వస్తువులను అవసరమైన వారికి అందించడమే కాకుండా రీసైక్లింగ్ యూనిట్లకు పంపించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్నశానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్య



నిర్మానుష్యంగా రోడ్డు

మండుతున్న ఎండలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

వేసవి ఉష్ణోగ్రత లు నలభై డిగ్రీలకు పైగా నమో దవ్వడం తో పాటు శుక్రవారం వడగాల్పులు తోడయ్యాయి. దీనితో సాధారణ జనం బెంబేలెత్తిపోతున్నారు. వేసవిలో రోహిణి కార్తె మొదలైనప్పటి నుంచి ఉష్ణోగ్రతలు పెరిగాయి. వడగాల్పులతో పాటు ఉక్కపోత అధికమైంది. దీనితో చిన్నారులు, వద్ధులు తట్టుకోలేక తల్లడిల్లి పోతున్నారు. మరో వైపు మండుతున్న ఎండలకు రోడ్లు అన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. జనసంచారం లేక కర్ఫ్యూ వాతావరణం తలపిస్తున్నాయి. ప్రయాణికులు ప్రయాణాలు వాయిదా వేసుకుంటున్నారు. జనం 11 గంటల నుండి ఇళ్లకే పరిమిత మవుతున్నారు. వడగాల్పులు అధికంగా ఉన్నందున మధ్యాహ్న సమయం లో బయటకు రావద్దని, వడదెబ్బ కు గురైతే ఒఆర్ఎస్ ద్రావణం లేదా పంచదార, ఉప్పు కలిపిన నీటిని తీసుకోవాలని, దీనితో పాటుగా మజ్జిగ, నిమ్మరసం వంటివి తీసుకోవాలని,అత్యవసర పనులు ఉంటే ఉదయం%ం%సాయంత్రం సమయాలలో ప్రయాణాలు సాగించాలని, బయటకు వస్తే టోపీ ధరించాలని, మంచినీరు ఎక్కువగా తాగాలని వైద్యులు సూచిస్తున్నారు. మరో వైపు పగటి పూట విద్యుత్ కోతలు లేకుండా చూడాలని సామాన్యులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను మహిళా పోలీసులు సందర్శించాలి

ప్రజాశక్తి-అమలాపురం

అంగన్‌వాడీ కేంద్రాలను గ్రామ వార్డు సచివాలయ మహిళా పోలీసులు తరచుగా సందర్శించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. శుక్రవారం అమలాపురంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో సుస్థిర అభివద్ధి లక్ష్యాల డేటాలో వ్యత్యాసాలు, ఐదు సంవత్సరాల లోపు వయసు గల పిల్లల ఆధార్ నమోదు, ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన కార్డుల నమోదు, నాడు నేడు పనులు,ఆరోగ్యశ్రీ తదితర అంశాలపై ఐసిడిఎస్, గ్రామ వార్డు సచివాలయ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, ఆరోగ్యశ్రీ జిల్లా అధికారులతో కలిసి మండల స్థాయిలో ఎంపిడిఒలు మండల స్థాయి వైద్యాధికారులు, ఐసిడిఎస్ సిబ్బంది తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపిడిఒలు సచివాలయ సిబ్బందితో ఐదు సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలు ఆధార నమోదు చేసుకునేలా వారి తల్లిదండ్రులను ప్రోత్సహించాలన్నారు. సచివాలయాల్లో పనిచేసే మహిళా పోలీసులు అంగన్‌వాడీ కేంద్రాలను వారానికి ఒకసారి, నెలకు నాలుగుసార్లు సందర్శించి ఆయా కేంద్రాలలో పిల్లలకు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారం నాణ్యతను, సిబ్బంది పనితీరును, తనిఖీ చేయాలని ఆదేశించారు. తనిఖీ చేసిన వీడియో రికార్డింగ్ సంబంధిత అప్లికేషన్స్ అప్లోడ్ చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న సిబ్బంది ఖాళీలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేయాలని పీడీఐసిడిఎస్‌ను ఆదేశించారు. గ్రామాలలో ఉన్న గర్భిణుల వివరాలను సంబంధిత అప్లికేషన్స్ లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని ఐసిడిఎస్ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. సఖినేటిపల్లి మల్కిపురం మండలాలలో నాడు-నేడు పనులలో ఇసుక కొరత ఉందని కలెక్టర్ దష్టికి తీసుకురాగా ఇసుక కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ దుర్గారావు దొర, పీడీ ఐసి డియస్ సత్యవాణి, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి భీమేశ్వర్, డిసిహెచ్ఎస్ పద్మశ్రీ రాణి, ఐసిడిఎస్ సిబ్బంది, ఆరోగ్యశ్రీ సిబ్బంది, ఆరోగ్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

జగన్నన్న పాల వెల్లువపై సమీక్ష

ప్రజాశక్తి-రామచంద్రపురం

జగనన్న పాల వెల్లువ కార్యక్రమం పై సమీక్ష సమావేశాన్ని ద్రాక్షారామ పంచాయతీ కార్యాలయం వద్ద పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. పశుసంవర్ధక సహాయ సంచాలకులు రామకృష్ణ, మండల పశువైద్యాధికారి కృష్ణార్జున మాట్లాడుతూ పాల వెల్లువ కార్యక్రమాన్ని వాలంటీర్లు విజయవంతం చేయాలని త్వరలో ద్రాక్షారామలో అమూల్ పాల కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ మేరకు గ్రామాల్లో సర్వే నిర్వహించి ఎవరెవరికి ఎన్ని పశువులు ఉన్నాయి? ఎంత పాల దిగుబడి వస్తుందో వివరాలు సేకరించాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో వాలంటీర్లు, డిజి టల్ అసిస్టెంట్లు పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు



పంట కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు

పేరుకుపోతున్న చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

ద్రాక్షారామ మార్కెట్లో రోజురోజుకు చెత్త పెరిగిపోతోంది. దీనితోపాటు ఇక్కడ గల పంట కాలువ పూర్తిగా ప్లాస్టిక్ వ్యర్థాలతోనూ, చెత్తతోనూ నిండిపోయింది. పర్యావరణ పరిరక్షణ చెత్తను పూర్తిగా నిర్మూలి స్తామని పారిశుధ్యం మెరుగుపరుస్తామని గతవారం పాలకులు ప్రతిజ్ఞలు చేసినా అవి ఆచరణలో అమలు కావడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ద్రాక్షారామ మార్కెట్ సెంటర్‌కు వెళ్లే అరటిపండ్ల దుకాణాల వద్ద కూరగాయల మార్కెట్లను ప్రతిరోజు చెత్త పేరుకుపోతోంది. దీనితోపాటు ఈ కింద నుండి వెళ్లే పంట కాలువ చెత్త నిండిపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పని పరిస్థితి నెలకొన్నాయి. దీనిపై పంచాయతీ సిబ్బంది దష్టి సారించి పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని ద్రాక్షారామ గ్రామస్తులు రైతులు కోరుతున్నారు.

ఘనంగా బాలబాలాజీకి చక్రస్నానం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి బాల బాలాజీ స్వామి తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం వైనతేయ గోదావరి నదిలో శ్రీవారికి మంగళ వాయిద్యాల నడుమ చక్ర స్నానం చేయించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు మద్దాలి తిరుమల సింగరా చార్యులు, చిన జీయర్ స్వామి శిష్య బందం ఆధ్వర్యం లో ఉభయ దేవేరులతో కొలువు తీరిన శ్రీవారిని ముందుగా పల్లకీలో గ్రామోత్సవం నిర్వహిం చారు. యాత్రికులు వసంతాలు జల్లు కుంటూ వసంతోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి ఛైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఇఒ డి.శ్రీరామ వరప్రసాదరావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఆలయ సిబ్బంది, యాత్రికులు పాల్గొన్నారు.



బాల బాలాజీ స్వామికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

సమిష్టి కృషితోనే అభివృద్ధి

ప్రజాశక్తి - ఆలమూరు

ప్రజా ప్రతినిధులు, అధికారుల సమిష్టి కృషితో అభివృద్ధి సాధ్యమని ఎంపిపి తోరాటి లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం ఆయన అధ్యక్షన మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కె.జాన్ లింకన్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా పలు శాఖల అధికారులు సాధించిన ప్రగతి నివేదికలను సమావేశంలో వివరించగా పలువురు ప్రజా ప్రతినిధులు వారి సమస్యలను తెలిపారు. ఎంపిపి మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో సంబంధిత అధికారులు చురుకుగా పనిచేయాలన్నారు. అలాగే ప్రజా సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళిక బద్ధంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యుడు తోరాటి సీతామాలక్ష్మి, తహశీల్దార్ ఐపి.శెట్టి, వ్యవసాయ సలహా కమిటీ ఛైర్మన్ యనమదల నాగేశ్వరరావు, ఎంఇఒ మురళి సత్యనారాయణ, ఇఒపిఆర్‌డి రాజ్ కుమార్, ఎఒ రామస్వరూప్, శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలోపాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కార్టూ'నిజం'



అక్కడ నిరసనల సెగలు.. ధరల మంటల ముందు..తమరి ప్రతాపం ఏం అనడం లేదు సూర్యదేవా...!!!

ప్రశ్నిస్తే తప్పుడు కేసు పెడతారా?

కాట్రేనికోన సర్పంచ్ సుధాకర్

ప్రజాశక్తి-కాట్రేనికోన

కాట్రేనికోన పిహెచ్‌సి డాక్టరు, సిబ్బంది పనితీరు, రోగుల పట్ల వారి నిర్లక్ష్యంపై తాను మండల పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో ప్రశ్నించినందుకే తనపై అక్రమ కేసు బనాయించారని కాట్రేనికోన గ్రామ పంచాయతీ సర్పంచ్ గంటి వెంకటసుధాకర్ ఆరోపించారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ పరిధిలోని మూడు, నాలుగు సచివాలయాల్లో ఎంఎల్‌హెచ్‌పిలు తన వద్దకు వచ్చి జాయింట్ బ్యాంక్ అకౌంట్ కోసం సంతకం చేయాలని అడిగారన్నారు. ఐదు నెలలుగా ఎక్కడ పనిచేస్తున్నారని ప్రశ్నించినందుకే తనపై కుట్ర పన్ని కావాలనే వైద్యాధికారి తన సిబ్బందిని నా ఇంటికి పంపించి తప్పుడు కేసులు పెట్టించారన్నారు. ఎంఎల్‌హెచ్‌పిలు ఐదు నెలలుగా ఎక్కడ పని చేస్తున్నారో పంచాయతీ కార్యదర్శికి, ఆయా సచివాలయాలు పరిధిలోని ప్రజలకు కూడా తెలియదన్నారు. తాను ముందుగానే ఈ విషయమై డాక్టరు, ఎంపిడిఒలకు ఫిర్యాదు చేశానని తెలిపారు. వారిపై చర్య తీసుకోవాలని కోరానని, లేకుంటే కలెక్టర్, జిల్లా వైద్యాధికారులకు ఫిర్యాదు చేస్తానని చెప్పినా పట్టించుకోలేదన్నారు. విధులకు గైర్హాజరైన సిబ్బందికే వత్తాసు పలికారని ఆరోపించారు. గత నెల 20న రాజీ అంటూ తన ఇంటికి వచ్చిన సిబ్బందిలో సూపర్‌వైజర్ రాధాకృష్ణ దుర్భాషలు ఆడడమే కాకుండా, తనను అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కాట్రేనికోన పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. తప్పుడు ఫిర్యాదునే పోలీసులు పరిగణలోకి తీసుకుని ఏకపక్షంగా వ్యవహరించారన్నారు. స్టేషన్ బెయిల్ ఇచ్చే అవకాశం ఉన్న కావాలనే ఎస్ఐ నిరాకరించారన్నారు. సర్పంచ్‌గా తనకే న్యాయం జరగకుంటే సామాన్యుడికి ఎక్కడ న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. దీంతో తాను జిల్లా కోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ తీసుకున్నానన్నారు. సిబ్బంది విధులకు గైర్హాజరుపై సంబంధిత శాఖ అధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేయిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. స్థానిక అధికారులు తీరుపై కలెక్టర్, జిల్లా వైద్యాధికారి, ఎస్‌పిలకు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. అప్పటికీ న్యాయం జరగకుంటే న్యాయపోరాటం చేస్తానని సర్పంచ్ వెల్లడించారు.



గంటి వెంకట సుధాకర్



పింఛను అందజేస్తున్న దృశ్యం

శ్రీనివాసరావుకు పింఛను అందజేత

ప్రజాశక్తి-అమలాపురం

లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ ఆపరేషన్ చేయించుకున్న నార్గాన శ్రీనివాసరావుకు సిఎం జగన్ వైద్య ఆరోగ్య శాఖ నుంచి ప్రతి నెలా పెన్షన్ నిమిత్తం ఆర్థిక సాయం రూ.5వేలు ఈ ఏడాది జనవరిలో ప్రకటించారు. ఈ సొమ్మును అల్లవరం ఎంపిపి ఇళ్ల శేషారావు, అల్లవరం జెడ్‌పిటిసి సభ్యుడు కొనుకు గౌతమీమహేష్ బాధితునికి శుక్రవారం అం దజేశారు. కార్యక్రమంలో అల్లవరం మండల వైసిపి అధ్యక్షుడు కొనుకు బాపూజీ, అల్లవరం మం డల అభివృద్ధి అధికారి సరోవర్, ఎంట్రుకోన సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీనివాస్, ఎంట్రుకోన గ్రామ కమిటీ వాసర్ల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వాసర్ల శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

కోటిపల్లి సోమేశ్వరాలయం అభివృద్ధికి రూ.4 లక్షల విరాళం

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని కోటిపల్లిలో గల ఛాయాసోమేశ్వర స్వామి ఆలయ మండపం అభివద్ధికి డిప్యూటీ లేబర్ కమిషనర్ వి.శ్రీనివాస్ రూ.4 లక్షల విరాళం అందజేశారు. స్వామివారి ఆలయ మండపం అభివద్ధికి ఈ నిధులు ఖర్చు చేస్తామని ఇఒ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం అభివద్ధి పనులు ప్రారంభించారు కార్యక్రమంలో గ్రామ అభివద్ధి కమిటీ ఛైర్మన్ పప్పుల శ్రీను బాబు, రేవు శ్రీను, గ్రామ సర్పంచ్ పెమ్మాడి బేబీ సత్తిబాబు, కాకుమల్ల కష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ పథకాల పునరుద్ధరణకు డిమాండ్

ప్రజాశక్తి-మండపేట

వైసిపి ప్రభుత్వం రద్దు చేసిన ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ అభివద్ధి పథకాలను పునరుద్ధరించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కామన ప్రభాకరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిల అభివృద్ధికి ఎంతగానో తోడ్పడే పథకాలను ఈ ప్రభుత్వం రద్దు చేయడం దారుణం అన్నారు. ఈ పథకాల పునరుద్ధరణ కోసం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో రాజోలు నియోజకవర్గంలోని సఖినేటిపల్లి వంతెన వద్ద శనివారం ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ ముఖ్య అతిథిగా పాల్గొంటున్న ధర్నా కార్యక్రమంలో జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నేరాలు ఘోరాలు

బాకీ తీర్చలేదని మామ హత్య

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

తను చెప్పిన బాకీ తీర్చలేదని అత్తామామలపై అల్లుడు దాడి చేయగా మామ మృతి చెందగా తీవ్రగాయాలైన అత్తను స్థానికులు వైద్య చికిత్స నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ సిఐ వైవి.రమణ తెలిపిన వివరాల ప్రకారం. పసివేదల గ్రామంలో రాయించుల శ్రీరామకృష్ణారావు, దేవి దంపతులు నివశిస్తున్నారు. ఒక బాకీ జమ చేసే విషయమై రామకృష్ణారావుతో అల్లుడు నందిగం గోపి వాగ్వివాదానికి దిగాడు. చిన్న గ్యాస్ సిలిండర్‌తో దాడి చేయడంతో శ్రీరామకృష్ణారావు(62) మృతి చెందారు. దాడిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన అత్త దేవి తీవ్రంగా గాయపడింది. ఆమెను స్థానికులు రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



మట్టి ట్రాక్టర్ ఢీకొని యువతి మృతి

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

మండలంలోని నడిపూడి లాకులు వద్ద శుక్రవారం మట్టి ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో అదే గ్రామానికి చెందిన యువతి మృతి చెందింది. ఈ ఘటనలో మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇవి.. నడిపూడికి చెందిన పెనుమాల శాంతి తన టెన్త్ సరిఫికెట్ల కోసం తన ఇద్దరు స్నేహితులతో కలిసి శుక్రవారం పాఠశాలకు వెళ్లింది. సర్టిఫికెట్లు తీసుకుని తిరిగి వస్తున్న సమయంలో నడిపూడి లాకుల వద్ద వీరిని మట్టి ట్రాక్టర్ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో శాంతి అక్కడకక్కడే మృతి చెందింది. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరిని ఆసుపత్రికి తరలించారు. వీరి పరిస్థితి విషమంగా ఉందని బంధువులు చెబుతున్నారు. అయితే గ్రామస్తులు మృతదేహాన్ని ప్రమాద స్థలంలో ఉంచి ధర్నాకు దిగారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. ఘటనా స్థలానికి రూరల్ సిఐ ఆధ్వర్యంలో పోలీసు బృందం చేరుకుని కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి - తాళ్ళరేవు

గాడిమొగ పంచాయతీ చిన వలసల గ్రామానికి చెందిన రామాడి వెంకటేశ్వర్లు (48) వేటకు వెళ్లి కాళ్లకు వల్ల చిక్కుని మృతి చెందినట్లు కోరంగి ఎస్ఐ. పి.శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. చినవలసల గ్రామానికి పక్కనే ఉన్న చెరువులో వేటాడుతుండగా కాళ్లకు వల చిక్కుకుని మునిగిపోయి వెంకటేశ్వర్లు మరణించినట్లు తెలిపారు. వెంకటేశ్వర్లు భార్య మరణించగా, అతనికి ముగ్గురు కుమారులు ఉన్నారు.

పెన్షన్ సొమ్ములతో వెల్ఫేర్ అసిస్టెంట్ పరారు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

కొండవరం గ్రామానికి చెందిన వద్ధులకు వికలాంగులకు అందించాల్సిన పెన్షన్ డబ్బులతో వెల్ఫేర్ అసిస్టెంట్ పొన్నాడ వీరబాబు పరారైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నేటికీ లబ్ధిదారులకు నగదు ఇవ్వకపోవడంతో వీరబాబుకు ఫోన్ చేసినా స్పందించ లేదు. దీంతో పెన్షన్ సొమ్ముతో పరారైనట్లు గుర్తించి కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

తాగిన మైకంలో తండ్రి పక్కలో నలిగి పసికందు మరణం

ప్రజాశక్తి - గోపాలపురం

తాగిన మైకంలో ఉన్న తండ్రి పక్కలో నలిగిపోయి ఆరు నెలల పసికందు మృతి చెందిన సంఘటన మండలంలోని వెంకటయపాలెంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంకటాయ పాలెంకు చెందిన వేమూలూరి గాంధీ సుబ్బలక్ష్మి దంపతులకు 6 నెలల బేబీ దివ్య ఉంది. గాంధీ కూలి పనికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చాడు. కల్లు తాగి వచ్చిన గాంధీ పక్కనే పాపను పడుకోబెట్టారు. తండ్రి పక్కలో నలిగిపోయిన చిన్నారి అపస్మారక స్థితిలో ఉండడాన్ని గమనించిన తల్లి హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. తల్లి సుబ్బలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - యానాం

వ్యక్తి అదృశ్యంపై యానాం పోలీస్ స్టేషన్లో గురువారం కేసు నమోదయింది. తాళ్ళరేవు మండలం సుంకరపాలెం గ్రామానికి చెందిన డాక్టర్ చిక్కం వివేక్ మే 31వ తేదీన ఇంట్లో నుండి వెళ్లిపోయి తిరిగి రాలేదని తెలిపారు. దీంతో చిక్కం విక్రమ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు.

ఏలేరులో గల్లంతైన వ్యక్తి మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి- జగ్గంపేట రూరల్

ఏలేరు ప్రాజెక్ట్ వద్ద స్నానానికి దిగి గల్లంతైన యువకుడుని మృతదేహాన్ని పోలీసులు శుక్రవారం గుర్తించారు. భావారం గ్రామానికి చెందిన ప్రాజెక్ట్ వద్దకు ఈత కోసం 14 మంది యువకులు వెళ్లారు. వారిలో ఒకరైన మర్రిపాక గ్రామానికి చెందిన వాసంశెట్టి మౌలేష్ (19) పమాదశాత్తు లోయలో పడి మతి చెందాడు. ఎస్ఐ విద్యాసాగర్ గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని శుక్రవారం వెలికి తీశారు. ఈ మేరకు జగ్గంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ ప్రధాన బాధ్యత

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రజల ప్రాణాలను కాపాడడంతో పాటు, వారి ఆస్తుల పరిరక్షణ పోలీసుల ప్రధాన బాధ్యతని ఏలూరు రేంజ్ డిఐజి జివిజి.అశోక్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కాకినాడ నేర సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయనకు ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్, ఇతర పోలీస్ సిబ్బంది ఆహ్వానం పలికారు. ఎస్ఫి కార్యాలయాన్ని పరిశీలించిన అయన ప్రజలకు పోలీసుల నుంచి అందుతున్న సహాయ సహకారాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పోలీస్ సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన నేర సమీక్ష విధానంలో పోలీస్ సిబ్బంది పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పిలు పి.శ్రీనివాస్, ప్రేమ్ కాజల్, డిఎస్‌పిలు, సిఐలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఐజి అశోక్ కుమార్

వేసవి శిబిరాల్లో విద్యార్థులకు విజ్ఞానం

వేసవి శిబిరాల్లోని విద్యార్థులకు వినోదంతో కూడిన విజ్ఞానాన్ని అందిస్తున్నట్లు పలువురు తెలిపారు. శుక్రవారం పలుచోట్ల వేసవి శిబిరాలు నిర్వహించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

పెద్దాపురం చిన్ననాటి నుంచి గురువులను, తల్లిదండ్రులను గౌరవించడం విద్యార్థులు తమ జీవనంలో భాగంగా మలుచుకోవాలని ఉపాధ్యాయని వాడపల్లి విమలా రాణి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆమె విద్యార్థులకు తల్లిదండ్రులు, గురువుల గొప్పదనం గురించి వివరించారు. జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు మల్లికార్జునరావు యాసలపు సూర్యారావు భవనంలో చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో ఒరిగామిపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్యాంపు కో-ఆర్డినేటర్ రొంగల అరుణ్, కూనిరెడ్డి అరుణ, అమత నమ్రత,మంజుల, ఐశ్వర్య, జ్యోత్స్న, సత్య, సూరజ్, కూనిరెడ్డి రవి,ఆర్ రవి, కష్ణ, వీర్రాజు పాల్గొన్నారు. **కరప** జనవిజ్ఞాన వేదిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అరుంధతి పేట, వలసపాకలు, రామకంచిరాజు నగర్ కమ్యూనిటీ హాల్లో వేసవి వినోదం కార్యక్రమాలు నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్లమూరి శ్రీరామారావు విద్యార్థులకు ఓరిగామి, మ్యాజిక్, పజిల్స్ నేర్పించారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్ద సుబ్బారావు, వలసపాకలు గ్రామ సర్పంచ్ రామారావు, ప్రజాసంఘాల నాయకులు రమణి, రామ్ ప్రసాద్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. **కాకినాడ** రోటరీ క్లబ్ ఛైర్మన్ పి.వి సుబ్బారావు జిల్లా గ్రంథాలయ సంస్థ నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో చిత్రలేఖన పోటీలను పరిశీలించారు. లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, పి.వీరబాబు, రిసోర్స్‌పర్సన్స్ జయరామ్, పద్మావతి పాల్గొన్నారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మండల పరిధిలో అన్ని గ్రామాల్లో అధునాతన సాంకేతికతో కూడిన జగనన్న శాశ్వత భూ హక్కు రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసిల్దార్ లక్ష్మీనరస కుమారి, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు పిలుపునిచ్చారు. వేట్లపాలెం పంచాయితీ కార్యాలయం వద్ద శుక్రవారం రీ సర్వే నిర్వహణపై రైతులకు అవగాహన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మండల పరిధిలో అన్ని గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తయ్యి, ప్రస్తుతం రీ సర్వే ప్రారంభిస్తున్నామన్నారు. ఈ విధానంలో ఖచ్చితమైన సమాచారం ఇవ్వడం జరుగుతుందని, గ్రామాల్లో రైతులు 100 శాతం రీ సర్వేకు వీఆర్‌ఓలు, విలేజ్ సర్వేయర్ల టీం వచ్చినప్పుడు తమ రికార్డులతో హాజరై రీ సర్వేకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వేట్లపాలెం ఉప సర్పంచి గోలి శ్రీరామ్ చౌదరి, గ్రామ కార్యదర్శి మోషే, వీఆర్వోలు మామిడాల కామరాజు, కెవివి సత్యనారాయణ, లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

అరుణాచలానికి బస్సు ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ బస్ స్టేషన్ నుంచి అరుణాచలం స్పెషల్ బస్సును ఆర్‌టిసి ఏర్పాటు చేసింది. శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంటకు ఈ బస్సును కాకినాడ ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సు కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం కంచి దర్శనం అనంతరం ఆదివారం రాత్రికి కాకినాడకు చేరుకుంటుంది. ఈ కార్యక్రమంలో కాకినాడ డిపో మేనేజర్ ఎంయువి.మనోహర్, టి.బాలకృష్ణ పాల్గొన్నారు.

ఇఒపిఆర్‌డిగా కర్రి సత్యారెడ్డి

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సామర్లకోట మండల నూతన విస్తరణాధికారి ఇవోపిఆర్‌డిగా కర్రి హరికృష్ణ సత్యారెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఇక్కడ పని చేస్తున్న హిమా మహేశ్వరి పెద్దాపురం ఇన్‌చార్జి ఎంపిడిఒగా బాధ్యతలు నిర్వహిస్తుండడంతో సీనియర్ గ్రామ కార్యదర్శి వై.శ్రీహరి ఇన్‌చార్జి ఇవోపిఆర్డీగా వ్యవహరిస్తున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా అనపర్తి నుంచి సత్యారెడ్డి సామర్లకోటకు బదిలీపై వచ్చారు. ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఎంపిడిఒ డి.శ్రీలలితలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి -కరప

ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని కరప ఎస్ఐ ఎన్.రామకష్ణ అన్నారు. శుక్రవారం గొడ్డటిపాలెం సర్పంచ్ వాసంశెట్టి శ్రీనుబాబు తండ్రి వెంకట్రావు వర్థంతి సందర్భంగా ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీని ఎస్ఐ ప్రారంభించారు. వారధి కార్యక్రమంలో భాగంగా కరప మండలం, గొడ్డటిపాలెంలో ఉపాధి హామీ పథకం కూలీలకు అవగాహన కల్పించారు. చిన్న చిన్న సమస్యలు వస్తే గ్రామ స్థాయి సర్పంచ్ సమక్షంలో పరిష్కరించు కోవాలని ఎస్ఐ సూచించారు. ఉపాధి కూలీలు ఎండల తీవ్రత జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఏఎన్ఎం చంద్రకళ వడగాల్పుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై కూలీలకు అవగాహన కల్పించారు.

దోమల వ్యాప్తి నివారణకు డ్రైడే

ప్రజాశక్తి- కరప

దోమల వ్యాప్తి నివారణకు ఫ్రైడే- డ్రైడే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు వైద్యాధికారి శ్రీనివాస్ నాయక్ తెలిపారు. మండల గ్రామాలలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని ఏఎన్‌ఎంలు ఆశ వర్కర్లు, ఆయా గ్రామాలలో ఇంటింటికి తిరుగుతూ మురుకునీటి కుంటలలో ఏబేట్ మందు పిచికారి చేసారు, కొబ్బరి బొండాలు టైర్లు వంటి వ్యర్థ పదార్థాలను ఆవాసాల మధ్య ఉంచకుండా దూరంగా డంపింగ్ యార్డ్‌కు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం లు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పింఛను అందజేత

ప్రజాశక్తి -కరప

మండలంలోని ఉప్పలంకకు చెందిన ఒక కాకినాడ ఆసుపత్రిలో ఉండడంతో అక్కడికి వెళ్లి వృద్ధాప్య పింఛను అందించినట్టు సర్పంచ్ బి.నయోమి సతీష్ తెలిపారు. పట్టా నారాయణ స్వామి వారం రోజుల నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం సచివాలయ సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ అపర్ణ ఆసుపత్రికి చేరుకుని ఆయనకు పింఛను అందించారు.

పాత వస్తువులను అందజేయాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

పనికిరాని పాత వస్తువులను రీ సైక్లింగ్ కోసం బోట్ క్లబ్ పార్కులో నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన స్టాల్ వద్ద అందజేయాలని వాకర్స్ సంఘ అధ్యక్షులు అడబాల రత్నప్రసాద్ కోరారు. బోట్ క్లబ్ పార్కులో నగరపాలక సంస్థ నిర్వహిస్తున్న స్టాల్‌లో పాత వస్తువులను అందించి సర్టిఫికెట్ అందుకున్న అడబాల మాట్లాడుతూ ఇళ్లలో ఉండే పనికిరాని వస్తువులు వలన చెడ లేదా తుప్పు పట్టడం జరుగుతుందన్నారు. పాత పుస్తకాలు, దుస్తులు, బ్యాగులు, పాదరక్షలు, బూట్లు, బొమ్మలు, ప్లాస్టిక్ తదితర సామాగ్రిని స్టాల్‌లో అందజేయాలన్నారు.

యానాం వార్తలు

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

ప్రజాశక్తి - యానాం



మాట్లాడుతున్న ఎంఎల్ఎ అశోక్

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి చికిత్స చేయించు కోవాలని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అన్నారు. శుక్రవారం స్థానిక దరియాలతిప్పలో కె.ఆర్ నారాయణన్ ప్రభుత్వ హైస్కూల్లో ఒఎన్‌జిసి సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యానాం నియోజకవర్గంలో కంటి సంబంధిత వ్యాధులకు పూర్తిస్థాయిలో ప్రజలకు ఉచితంగా చికిత్సతో పాటు క్యాటరాక్ట్ ఆపరేషన్లు చేయించాలనే ఉద్దేశంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశామన్నారు. శిబిరంలో సుమారు 200 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారు. 20 మందికి కంటి ఆపరేషన్ అవసరముందని వైద్యులు నిర్ధారించారు. దీంతో వారిని రాజమహేంద్రవరం పరమహంస యోగానంద నేత్రాలయానికి పంపించారు. అనంతరం 150 మందికి పైగా ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ నెల 4న కనకాల పేటలో నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎఒ మునిస్వామి, ప్రభుత్వ ఆసుపత్రి ఎడి పలాస్ కుమార్ సెంధ్యాల్, విద్యుత్ శాఖ ఎఇ లంక కష్ణారావు, సిఐ షణ్ముగం, లయన్స్ క్లబ్ యానాం పిల్లారాయ అధ్యక్షుడు పులవర్తి శ్రీను, గిడ్ల వెంకన్న, కమిడి బాలయోగి, దాసరి బుజ్జి, సబ్బతి శ్రీనివాసరావు, గిడ్ల బాలయోగి, పండు సిద్ధార్థ కుమార్, కొల్లు మాధవస్వామి, నూకాంబరం, సబ్బతి లోకేశ్వరరావు, అలెక్స్, కామిరెడ్డి వీరబాబు పాల్గొన్నారు.

డెంగీ ప్రభావిత ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి - యానాం

డెంగీ జ్వరాలు ప్రబలిన ప్రాంతాల్లో ఆర్‌ఎఒ మునిస్వామి సంబంధిత అధికారులతో కలిసి శుక్రవారం ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. మెట్టకూరు ఫిషర్మెన్ పేట, వంశీకష్ణ కాలనీ, రమాబాయి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుధ్యం ఎలా ఉందో పరిశీలించారు. జ్వర పీడితులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. మున్సిపాలిటీ పరంగా ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన పారిశుధ్య కార్యక్రమాల గురించి చర్చించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి ఎడి పలాస్ కుమార్ సెంధ్యాల్, మున్సిపల్ మేనేజర్ ఖండవల్లి రామకష్ణ, విద్యుత్ శాఖ ఎఇ లంక కృష్ణారావు, చెల్లి గోపీనాథ్ పాల్గొన్నారు.

ఉచితంగా 10 వేల హెల్మెట్లు పంపిణీ

ప్రజాశక్తి - యానాం

యువతీ యువకులు వాహనాలు నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోని కారణంగా ప్రమాదాల తీవ్రత ఎక్కువవుతుందని ఎస్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్ అన్నారు. శుక్రవారం స్థానిక కొత్తపేట, భీమ్ నగర్, మెట్టకూరు తదితర గ్రామాల్లో మాజీ మంత్రి, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కష్ణా రావు సమకూర్చిన హెల్మెట్లను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైకులు నడిపేటప్పుడు ప్రమాదాల నివారణకు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలన్నారు. మల్లాడి కృష్ణారావు పుట్టినరోజు వేడుకల్లో భాగంగా సుమారు 10 వేల హెల్మెట్లు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. గూటం శివగణేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిడ్ల చంద్రరావు, మాజీ వైస్ చైర్మెన్ పెండెం సూర్యప్రకాష్, కోన కొండబాబు, శేరు కృష్ణ పాల్గొన్నారు.



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి

ప్రజాశక్తి-అమలాపురం

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అమలాపురం మున్సిపల్ కమిషనర్ వొమ్మోలు అయ్యప్ప నాయుడు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మిషన్ లైఫ్, మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ్ షెహర్‌లో భాగంగా శుక్రవారం మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు, పట్టణ యువతచే నిర్వహించిన సైకిల్ ర్యాలీని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ముందుగా విద్యార్థులు, యువతతో పర్యావరణ హిత జీవన శైలి కి కట్టుబడి ఉంటానని శానిటేషన్ ఇన్విరాన్‌మెంట్ సెక్రెటరీ బండి వీరన్న ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ నాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శక్తి వనరులను, నీటిని పొదుపు చేయాలని అన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తగ్గించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో శానిటేషన్, ఇన్విరాన్మెంట్ సెక్రెటరీస్ కె.ఈశ్వరరావు, చింతా నాగేంద్ర ప్రసాద్, వి.సతీష్, పి.భారతిదేవి, ఎం.భార్గవి, వైఎస్.భారతి, ఎం.లావణ్య, ప్రజా ప్రతినిధులు పడాల నానాజీ, పిండి రాజా తదితరులు పాల్గొన్నారు.

బైకు ఢీకొని మహిళకు గాయాలు

ప్రజాశక్తి-మండపేట

స్థానిక మెయిన్ రోడ్డు వాణి మహల్ సెంటర్ ఐసిఐసిఐ బ్యాంకు వద్ద మోటర్ సైకిల్ ఢీకొని మహిళ శుక్రవారం ఉదయం గాయాలపాలైంది. పట్టణానికి చెందిన గనిరెడ్డి అనంతలక్ష్మి రోడ్డు చెంతనే నడుచుకుంటూ వెళుతుండగా వెనుక వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొనడంతో ఆమె కింద పడిపోగా తలకు గాయమైంది. ఆమెను స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు టౌన్ ఎస్ఐ కోన అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికను మోసగించిన వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

బాలికను పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన కేసులో నిందితునికి అమలాపురం జడ్జి 14 రోజులు రిమాండ్ విధించినట్లు అమలాపురం తాలూకా ఎస్ఐ పరదేశి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం.. అమలాపురం రూరల్ మండలం ఇమ్మిడివరప్పాడు గ్రామానికి చెందిన యలగన గణేష్ అదే గ్రామానికి చెందిన ఒక మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని తీసుకెళ్లాడు. ఆ తర్వాత బాలికను మోసం చేయడంతో అమలాపురం డిఎస్‌పి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ రిపోర్ట్ తో కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం నిందితునికి రిమాండ్ విధించారు.

4న మెగా స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఆత్రేయపురం గ్రామానికి చెందిన నెహ్రూ అవార్డు గ్రహీత రిటైర్డ్ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ వేగేశ్న తమ్మి రాజు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి ఒక మెగా స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయనశుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు ఈనెల 4న సాయంత్రం గ్రామంలో వివి.కష్ణంరాజు గెస్ట్ హౌస్ వద్ద సమావేశం డాక్టర్ కష్ణంరాజు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు మహాత్మా గాంధీ కళాశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరై సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు తమ సలహాలను అందించాలన్నారు.

లాకుల బంగ్లాలో అసాంఘిక కార్యకలాపాలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం



లాకుల బంగ్లా

పర్యాటకులతో సందడిగా ఉండే లొల్ల లాకుల బంగ్లా అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. బంగ్లా చెంతని ప్రభుత్వ మద్యం దుకాణం ఉండడంతో మందు బాబులు మద్యం తాగిన మత్తులో ఈ బంగ్లా వద్ద ఇష్టాను సారంగా ఉంటున్నారు కొంతమంది యువత గంజాయి వంటి మత్తు పదార్థాలను సేవించి ఇక్కడికి వచ్చి పర్యాటకుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. ఇటీవల కాలంలో పోలీసులు ఈ బంగ్లాలో 20 కేజీల గంజాయితోపాటు ముగ్గురు యువకులను అదుపులో తీసుకున్నారు ఈ విషయంపై పలుమార్లు జల వనరుల శాఖ అధికారులు ఫిర్యాదు చేసిన పట్టించుకున్న దాఖలాలు లేవని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతా ధికారులు కలగజేసుకుని ఇక్కడ ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలుచేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పూడికతీత పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఆలమూరు

చెముడులంకలో మెయిన్ డ్రెయిన్ పూడికతీత పనులు శుక్రవారం ప్రారంభించగా సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే వర్షాకాలానికి ముందే డ్రెయిన్‌లో పూడిక బయటికి తీసి శుభ్రం చేసే చర్యలు చేపట్టామన్నారు. అలాగే ప్రజలు కూడా ఎటువంటి ప్లాస్టిక్, చెత్త చెదారం డ్రెయిన్‌ల వేయవద్దనిసూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దొండపాటి చంటి, మోటూరి సురేష్ అడబాల వీర్రాజు, దొండపాటి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏరువాకలో పాల్గొనాలని కలెక్టర్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి - ఆలమూరు

సార్వా వరిసాగులో భాగంగా మండలంలోని గుమ్మిలేరులో నిర్వహించనున్న ఏరువాక కార్యక్రమంలో పాల్గొని విత్తనాలు చల్లే కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఆ గ్రామ సర్పంచ్ గుణ్ణం రాంబాబు జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా ను ఆహ్వానించారు. రైతు భరోసా కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన కలెక్టర్‌ను సర్పంచ్ రాంబాబు కలుసుకొని వరి వెన్నుల గుత్తును అందించారు. సార్వా ఏరువాకను తమ గ్రామం నుంచి ప్రారంభించాలని ఆయన కోరారు. ఏరువాక ద్వారా విత్తనాలు చల్లే కార్యక్రమం తమ గ్రామంలో ప్రారంభిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు సర్పంచ్ గుణ్ణం రాంబాబు శుక్రవారం విలేకరులకు తెలిపారు.

పలు అంశాలపై అవగాహన

ప్రజాశక్తి - మామిడికుదురు

విద్యార్థులు మహిళా హక్కులు, బాలికల సంరక్షణ, బాల్యవివాహాలు, తదితర అంశాలతో పాటు వ్యవసాయ రంగంపై అవగాహన కల్పించుకునే విధంగా యాజమాన్యం ప్రోత్సహించడం అభినందనీయమని నగరం ఎస్ఐ షేక్ జానీ బాషా అన్నారు. రాజమహేంద్రవరం చైతన్య స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న అప్పనపల్లికి చెందిన పసుపులేటి గుణ స్వాతిక్ సమ్మర్ ప్రాజెక్ట్ రిపోర్టును శుక్రవారం ఎస్ఐకు సమర్పించారు. చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందని ఎస్ఐ విద్యార్థికి సూచించారు.

ఎన్‌టిఆర్ క్యాంటీన్లు ప్రారంభించండి

ప్రజాశక్తి - గోపాలపురం



వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న ముళ్లపూడి బాపిరాజు

ఎన్‌టిఆర్ గురించి మాట్లాడే అర్హత టిడిపి నాయకులకు లేదని కొడాలి నాని, మరికొంత మంది వైసిపి నాయకులు అంటున్నారని, వారికి ఏమాత్రం సిగ్గున్నా ఎన్‌టిఆర్ పేరున ఉన్న అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించాలని జడ్‌పి మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు అన్నారు. శుక్రవారం గోపాలపురంలో జేష్ట బుల్లిఅబ్బులు ఆర్థిక సాయం పేదలకు, వృద్ధులకు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి బాపిరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్‌టిఆర్ గురించి మాట్లాడే అర్హత టిడిపి వారికి లేదనడం సరికాదన్నారు. ఎన్‌టిఆర్ పేరున టిడిపి హయాంలో అన్నా క్యాంటీర్ల ద్వారా పేదలకు రూ.5కే భోజనం అందించారన్నారు. అటువంటి వాటిని వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. గుడివాడలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన బొమ్మతో ఓట్లు దండుకోవడం కాదని రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌టిఆర్ పేరున ఉన్న అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వైసిపి పేదల నోటివద్ద కూడును దూరం చేసిందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో బిసిలకు రాజకీయంగా, సామాజికంగా గుర్తింపు కల్పించిన మహానుభావుడు ఎన్‌టిఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా కొమ్ము నారాయుడు పుట్టినరోజు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని పెనికేరు టిడిపి నాయకులు, పార్టీ కొత్తపేట నియోజకవర్గ ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి, ఎమ్ఆర్‌పిఎస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్ము నారాయుడు పుట్టినరోజు వేడుకలు శుక్రవారం నాయకులు, అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యకమానికి అమలాపురం టిడిపి పార్లమెంట్ ఇంచార్జ్ గంటి హరీష్ మాథూర్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావులు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ముందుగా భారీ బైక్ ర్యాలీ పూర్తి చేసి, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసారు. ఇందులో భాగంగా గంటి హరీష్, సత్యానందరావు సమక్షంలో పలువురుని పార్టీలోకి ఆహ్వానించి కండువాలు కప్పారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు.